గోదావరి నవ్వింది

సాయంకాలము పెద్ద ముత్తైదువలాగ సూర్యుడు పసుపూ కుంకం పూసుకొని గోదావరిలో మునుగబోతున్నాడు. పక్షులు గూళ్లకు చేరుకుంటున్నవి. పశువులు ఇళ్లకు మళ్లుతున్నవి. నాగరీకగర్వమెరుగని జానపదులు కూడా తమతమ యిండ్లకు పోతున్నారు. నాగరీకులు క్లబ్బులకు వెళ్లుతున్నారు. నాగరీకుణ్ణి నేను షికారు పోతున్నాను!

గోదావరి యిద్దరి గట్టు మీద నుంచి నడిచి వెడుతున్నాను. గోదావరి గాలి తగిలినప్పుడు తప్ప, మిగిలిన సమయాల్లో గట్టు గట్టంతా పట్నవాసపు వాసన కొడుతోంది. ఒకచోట ఒక పెద్దమనిషి కాఫీకి బదులు ఇంకో పానీయమేదో పుచ్చుకుంటే దేహానికి ఆరోగ్యకరంగా ఉంటుందని ఒక సువాసినితో ముచ్చటిస్తున్నాడు. ఒకచోట ఇద్దరు వర్తకులు ధరల తేడాలను గురించీ, లాభాలను గురించీ ప్రసంగించుకొంటున్నారు. తాను తొడుక్కొన్న "జపానుపట్టులాగూ, పోలో కాలరు షర్టూ" తలుచుకొంటూ ఆనందం పొందుతున్నాడు ఒక బీద విద్యార్థి.

వెళ్లగా వెళ్లగా క్రమక్రమంగా ఈ వాసన తగ్గడం మొదలెట్టింది. కొంతసేపటికి ఒక కొత్త వాసన వేసింది. అది పల్లెటూరి వాసన.

చెట్ల నుంచి కమ్మని గాలి కొట్టుతోంది - గోదావరి మీద నుంచి వచ్చిన గాలి. మోటారు కార్ల బూడిద సోకని చెట్ల ఆకులు పచ్చగా, నున్నగా, అందంగా, జేగురు

ఎండలో ఆడుతున్నాయి. గట్టుకు రెండువైపులా స్వేచ్ఛగా పెరిగిన దుబ్బులు. ఆ దుబ్బులలో ముగ్గురు ఆడపిల్లలు సంచరిస్తున్నారు. సిగ్గు వాళ్ల హృదయాలలో ప్రవేశించబోయే వయస్సు. కాళ్లకు జోళ్లు తొడుక్కొన్నారు. జపాను తోళ్ళు కావు. ఈ కాలపు చదువుకొనే ఆడవాళ్లు వేసుకొనే వన్నెల చిన్నెల నగిషీ స్లిప్పర్సు కావు. వాళ్ల గ్రామంలో, వాళ్ల అన్నలో తమ్ములో మామలో తండ్రులో కుట్టించిన జోళ్ళు. పాదాలను కాపాడే జోళ్ళు. జోళ్ళవల్ల అందం సంపాదించుకోగోరే పాదాలు కావు వారివి. పాదాల వల్లనే జోళ్ళకు అందం వస్తోంది. ఏ సభలోనూ తీర్మానం చేసుకొని తదనుగుణంగా ధరించిన జోళ్ళు కూడా కావవి.

ఆ దుబ్బులలో ఆ ముగ్గురు ఆడపిల్లలూ ఏం చేస్తున్నారు? వాళ్లు ఆ దుబ్బులలో పాడుకొంటున్నారు. చుట్టుపట్ల చెట్ల మీద చిన్న చిన్న పక్షులు కూడా పాడుకొంటున్నవి. గోదావరిలో చిన్న చిన్న అలలు కూడా నాగరీకులకు వినిపించకుండా పాడుకొంటున్నవి.

వాళ్లు వేసుకొన్న బట్టలు బీద బట్టలు - చిరుగుల బట్టలు - కాని జపాను బట్టలు మాత్రము కావు. ఈ కాలపు చదువుకొన్న స్త్రీలు కట్టుకొనే తళుకుతళుకు బట్టలు చూచే నా కళ్ళకి వాళ్ళ బీద చిరుగు బట్టలే అందముగా కనిపించేయి. సొంత సొమ్ములకీ ఎరువు సొమ్ములకీ ఉండే తేడాలాంటిదే యీ బట్టల తేడా అనుకుంటా.

వాళ్ల ముఖములు సహజ సౌందర్యమును బూడిదతో కప్పుకోలేదు. వాళ్ల తలకట్లకు జపాను ఇంగ్లండు దేశములు అందము తీసుకురావడం లేదు.

గోదావరి గట్టున పెరిగే మోదుగు మొక్క దోర ఎరుపు పువ్వుల్లాగ వాళ్లు పుట్టినట్లే ఉండి మెరసిపోతున్నారు.

సూర్యబింబం గోదావరిలో సగం దిగిపోయింది.

చిదుకులూ, కర్రముక్కలూ, వేళ్ళూ నింపిన తట్టలను తలపై పెట్టుకొని ఆ ముగ్గురు కన్యలూ నెమ్మదిగా గట్టెక్కి ఇంటి మొగము పట్టారు. తోవలో వాళ్లను చూస్తున్న నేను వాళ్ల కళ్లకు తగిలేను.

పట్నవాసపు మనుష్యుల్ని పల్లెటూరి గేదెలు చూస్తే ఏం చేస్తాయి? అలాగే పట్టణవాసపు నన్ను వాళ్లు అలాగ బెదురుగా తప్పించుకుపోయారు.

నాగరీక గర్వమే నా తలకెక్కి ఉన్నట్లయితే వాళ్లని "పశువు"లని ఇంగ్లీషున తిట్టి వుందును. ఆలోచించి నన్ను నేనే అనుకొన్నాను ఆ మాట. ఎందువల్లనంటే వాళ్లు మొక్కలు పూసే పువ్వులు. నేనూ నా తెగ వాళ్లమూ కాగితపు పువ్వులము.

వాళ్ల వెంబడే నేను నడుస్తున్నాను కొంత దూరంగా. సంక్రాంతి రోజులవడంవల్ల గొబ్బిపాటలు విందా మని కొంచెం వాళ్లను సమీపించాను. వాళ్లు పాట ఆపి కళ్లు తళుక్కుమనిపించారు. నేను వెనక్కి తగ్గాను.

అప్పుడే గేదెలనూ ఆవులనూ తోలుకుంటూ గొల్లపిల్లలు యిళ్లకు వెడుతున్నారు. మీవేనా పశువులంటే మావే అని నాకేసి వింతగా చూచి గేదెల నదలించారు.

పల్లెలకు వెళ్లుతున్నారు - పట్నవాసమునకు కార్యార్థులై వచ్చిన స్త్రీ పురుషులు. కొందరు స్త్రీలు కావళ్ళు మెడల మీద వేసుకు వెళ్లుతున్నారు - వట్టి కావళ్ళు - బరువులేని కావళ్ళు. పట్నవాసపు సరుకులు కొనుక్కొని పొట్లాలు మోసుకుపోతున్నారు కొందరు - ఇంగ్లండులో ప్రచురించే ఇంగ్లీషు న్యూసు పేపర్లతో కట్టిన పొట్లాలు.

ఎవరి పనిమీద వారు వెడుతున్నారు. పనిలేకుండా ఆ గోదావరి గట్టున ప్రాణమున్న జీవమేదీ లేదు - చదువుకొన్న నేనొక్కణ్ణి తప్ప!

సూర్యబింబం ఇంకా గోదావరిలో మునగలేదు పూర్తిగా. మేఘాలు సూర్యుడి రంగులతో అలంకరించుకొన్నాయి. గోదావరిలో అలలు పెద్దవౌతున్నాయి.

ఆడపిల్లలు ముగ్గురూ ఊసులాడుకుంటూ వెడుతున్నారు. తట్టల బరువు మూలాన్ని నడిచేటప్పుడు ఆ పిల్లలకు అందమైన మెడవంపులు కలుగుతున్నాయి.

వాళ్ల గ్రామం సమీపించాము. తాటాకు యిళ్ల గ్రామం. పశువులు దూడల కోసం పరుగెత్తుకు వెళ్లాయి. పశువుల కాపర్లు వాటి వెనకనే వెళ్లి కట్టివేస్తున్నారు.

ఆ ముగ్గురు పిల్లలూ వాళ్ల వాళ్ల యిళ్లకు చేరుకున్నారు. వాళ్ల తల్లులప్పుడే బజారు నుంచి బియ్యం కొనుక్కు వచ్చి యిళ్లకు చేరుకొన్నారు. వాళ్ల తండ్రులూ అన్నలూ తమ్ముళ్లూ అప్పుడే కూలి పనులు ముగించి కూలి డబ్బులతో యిళ్లకు వచ్చారు.

ఆ పిల్లలు వాళ్లు తెచ్చిన చిదుకులూ కర్రలూ వాళ్లమ్మలకు వప్పగించారు. వాళ్లమ్మలు ఆ చిదుకులతో ఉడుకు నీళ్లు కాచి వాళ్ల నాన్నలకూ అన్నలకూ స్నానం చేయిస్తున్నారు. ఆ చిదుకులతోనే వాళ్లమ్మలు వాళ్ల కుటుంబానికంతకీ అన్నం వండుతున్నారు.

ఆనాటితో ఆ బియ్యం సరి. ఆ చిదుకులు సరి. మర్నాడు యధా ప్రకారం పిల్లలు చిదులకు, తల్లి బియ్యానికీ, నాన్నలూ అన్నలూ కూలికి.

పక్షులకూ వాళ్లకీ ఏమీ తేడా నాకు కనిపించలేదు. వాళ్లకీ పక్షులకీ దేవుడు మీద - వాళ్లను పుట్టించిన దేవుడు మీద - విశ్వాసముంది.

ఒక పక్షి దగ్గిరకు వెళ్ళి, పక్షీ పక్షీ, రోజూ ఎందుకు తిండికి తంటాలు పడతావు, ఒకనాడే కూడబెట్టుకొని సుఖంగా కొంతకాలం కూచుని గడుపుకోరాదా అంటే ఏమంటుంది? ఈ ప్రపంచం అంతట్లోనూ భగవంతుడు జీవకోటికి కావలసిన యావత్తూ కూడబెట్టి ఉంచాడు. ఇంకెక్కడ నేను వేరే కూడబెట్టుకోవడం - అంటుంది. నాగరీకుడికి నాకా మాటలలో సత్యం కనిపించదు.

గోదావరికేసి తిరిగి చూచాను. సూర్యుడు మాయమయ్యాడు. గ్రామంలో జానపదులు భోజనాలు చేసి సుఖనిద్రలో మునిగిపోయారు.

నేను గోదావరి గట్టు చేరుకున్నాను. పక్షులు నిద్రపోతున్నాయి. చెట్లూ నిద్రపోతున్నాయి. నేను గట్టంట ఈదురోమంటూ నడిచి వచ్చి పట్నం చేరుకున్నాను. పట్నంలో ప్రజలు ఇంకా ఇళ్ల మొహం పట్టలేదు.

నాకు పట్నవాసం మీద అసహ్యం పుట్టింది. ఆ పల్లెటూరికి వెళ్లి అక్కడే ఉండిపోతె బాగుంటుందనిపించింది. ఉదయమే గొల్లపిల్లలతో బయలుదేరి పశువుల్ని తోలుకుంటూ వెళ్లి ఏ చెట్టు నీడలోనో కూచుని ప్రకృతితో ఊసులాడుకుంటూ ఉంటే ఎంత బాగుంటుంది! చద్దిమూటలు విప్పుకొని చెట్ల నీడల్లో తినీ నా పశువులతో పాటు నేనూ ఆ గోదావరి నీరు తాగి ఆ చెట్ల నీడల్లో ఆడుకొంటూ ఉంటే! ఆ ప్రకృతి ఒళ్ళోనే అక్కడే నిద్రపోతే!

లేకుంటే, ఆ పిల్లలతోపాటు నేనూ ఒక గంప తీసుకొని చెప్పులు తొడుక్కొని పాటలు పాడే పక్షులు దాక్కొనే ఆ దుబ్బులలో చిదుకు లేరుతూ ఉంటే! పిల్లలతోపాటు 'నేనూ పాటలు పాడితే! మాతోపాటు ఆ పక్షులూ పాడితే! మా పాటలన్నీ గోదావరి వింటే!' అయితే నాగరీకుణ్ణి ఆ పిల్లలు దగ్గరికి రానిస్తారా? మనిషి ముట్టుకొన్న పక్షిని మళ్ళీ పక్షులు తమలో చేర్చుకోవట! నన్నా పిల్లలు వాళ్లతో చిదుకులేరనిస్తారా?

ఆ గ్రామంలోనే ఉండిపోయి ఆ గ్రామస్థుల వలనే నేను నిర్విచార జీవనం చేస్తూ ఉంటే! ఆలోచించి చూస్తే నేనా పనికి తగనేమో అనిపించింది. కూలి పనిచేసి కాయలు కాసిన చేతులు కావు నావి. ముళ్ళల్లోనూ, చేలగట్లనూ తిరిగి మొద్దుబారిన పాదాలు కావు నావి. శీతోష్ణాల నొక మాదిరిగా గ్రహించగలిగే దేహము కాదు నాది. ఉన్న దానితో సంతోషపడే చదువుకొన్న బుద్ధికాదు నాది. ప్రపంచాన్నంతనూ నా యింట్లో పెట్టుకోవాలని ఆశించే చదువుకొన్న బుద్ధి నాది. శీతోష్ణాలను నిరంతరమూ ప్రతిఘటించవలెనని ప్రయత్నము చేసే దేహము నాది. భూమి మీద మోపితే దాని మీద నుండే రోగ క్రిములను ఆకర్షించే పాదాలు నావి. బడి పుస్తకాలు మోసిన చేతులుగాని బండరాళ్ళు మోసిన చేతులుగావు నావి.

అయినా మనస్సమాధానము చేసుకొన్నాను. పోనీ నేను చదువుకొన్న వాడను గదా, నాకు వచ్చిన చదువు ఆ గ్రామస్థులకు చెప్పి తద్వారా జీవనోపాధి కల్పించుకోకూడదా అనుకొన్నాను. కొన్నాళ్ళు ఆ గ్రామంలోనే ఉండి గ్రామసేవ చేస్తూ వాళ్ల కృతజ్ఞత పొందకూడదా అనుకొన్నాను - చూచారా, నా చదువుకొన్న ఊహ! నేను చదువు చెప్పినందుకు వాళ్లు నాకు కృతజ్ఞత చూపాలిట! కూలిపని చేసే వాళ్లు యజమానులు తమకు కృతజ్ఞత చూపాలనుకొంటున్నారా? చిదుకులేరుకొనే ఆ కన్యలు తమ తల్లులు తమకు కృతజ్ఞత చూపాలనుకొంటున్నారా? పశువులు కాసేవాళ్లు ఆ పశువులు తమకు కృతజ్ఞత చూపాలంటున్నారా? సూర్యచంద్రాదులు కృతజ్ఞత నాశిస్తున్నారా? చదువు చెప్పబోయే నాకు మాత్రం ఆ గ్రామస్థులు కృతజ్ఞత చూపాలనుకొంటున్నాను!

తరువాత కొన్నాళ్లు ఉన్న తరువాత ఆ గ్రామంలోనే గృహ నిర్మాణం చేసుకొని ఒక యింటివాణ్ణి అవుతే! ఆ చిదుకులేరుకునే ఒక పిల్లను పెళ్లి చేసుకొని -

ప్రతిరోజూ గోదావరి గట్టున షికారు వెళ్లడం మొదలు పెట్టాను. క్రమక్రమంగా ఆ గ్రామస్థులతో

పరిచయం కల్పించుకొని, తరువాత వాళ్ల సమ్మతిని గ్రామంలో ప్రవేశించవలెనని సంకల్పం. ఊరి పెద్దల పరిచయం సంపాదించి ఒక చిన్న బడి పెట్టి తెలు, ఇంగ్లీషు, లెక్కలూ, సివిక్సూ వగైరా శాస్త్రాదులు వాళ్లకు బోధించవలెనని అనుకున్నాను.

ఆ ముగ్గురి పిల్లలలో ఒక పిల్లతో స్నేహం సంపాదించుకొని క్రమక్రమంగా ఆమె ప్రేమ దుర్గాన్ని ముట్టడించి పట్టుకోవాలనుకొన్నాను.

ఒకనాటి సాయంకాలం గోదావరి గట్టుమీద నిలబడ్డాను. చెట్ల ఆకులు ప్రతిరోజూ నన్ను చూస్తూండడంవల్ల నన్ను పరిచయస్తుణ్ణిగా భావించినవి.

చిన్న చిన్న పక్షులు కిలకిలమంటున్నవి. ఆ దుబ్బులలో నా కళ్ళు వెతకడం మొదలుపెట్టినవి. ఎవరి కోసమో నేను చెప్పడమెందుకు? మీకు తెలుసును. దుబ్బులు వట్టి చేతులు తిప్పి నాకు ప్రత్యుత్తర మిచ్చినవి.

ఎదురుగా గోదావరి, గోదావరి అవతల చిన్న చిన్న మేఘాలు పొదిగిన ఆకాశం. ఆ గోదావరి అంచునుంచీ ఒక పాట ప్రవహించి నా చెవులలో పడ్డది. అటు చూచాను. ఒక నల్లని విగ్రహం కనిపించింది. ఒక చితుకులేరుకొనే పిల్ల. ఒక పాట పాడుతోంది కాబోలు.

ఆ చోటికి కొద్ది దూరంలో ఒక మడి. ఆ మడిలో పనిచేస్తూన్న ఒక పిల్లవాడు. ఆ పిల్లవాడు ఆ పాటను విని నడుమెత్తి గోదావరికేసి తిరిగి ఒక చిన్న పల్లెటూరి పాట ఆ పిల్లకేసి పంపేడు. ఆ పిల్లకూ, ఆ పిల్లవాడికి మధ్యనున్న అవకాశం వాళ్ల పాటలకు బాట అయినది. ఆ బాటగుండా వాళ్ల హృదయాలు ప్రయాణం చేస్తున్నవి. ఆ బాటగుండా ప్రయాణం చేసి వచ్చిన ఆ పిల్ల హృదయాన్ని వాడు పట్టుకొని దాచుకొన్నాడు. ఆ పిల్లవాడి హృదయాన్ని ఆ పిల్ల పట్టుకొని దాచుకుంది. గోదావరి ఈ తమాషా అంతా చూచి నవ్వింది. ఇదంతా చూచి నేను బిక్కమొహం వేశాను.

ఆ పిల్లవాడు మడి వదలి ఆ పిల్లకేసి వస్తున్నాడు. ఆ పిల్ల చిదుకుల బుట్ట నెత్తిమీద పెట్టుకొని ఆ పిల్లవాడికేసి వస్తోంది. వాళ్లిద్దరూ చేతులు కలుపుకొని గట్టువేపు వస్తున్నారు. ఇళ్లకు వెడుతున్నారు. ఆ పిల్ల బీద చిగురుల బట్టలే కట్టుకొంది. ఆ పిల్ల చిదుకుల గంప యిటూ అటూ ఆడి ఆ పిల్ల ముఖాన్నీ మెడనీ ఇటూ అటూ తిప్పించి అందాలు కురిపిస్తోంది. ఆ పిల్ల కళ్లలోంచి ఆ పిల్లవాడి హృదయం తొంగి చూస్తోంది. ఆ పిల్లవాడి చేతులో కఱ్ఱ; తలకు తలపాగా, మొలకు గోచీ; వంటికి నల్లని తళతళ; కళ్లల్లో నుంచి ఆమె హృదయం తొంగి చూస్తోంది.

వాళ్లు నన్ను చూచారు చేతులు వదిలేశారు. దూరదూరంగా నడవడం మొదలు పెట్టారు. నన్ను వాళ్లు సమీపించారు. ఆ పిల్ల నన్ను చూచింది. నిత్యమూ నేను ఆ పిల్లకోసం ఏరి ఉంచుతూ ఉన్న చిదుకులు ఆ నా డా పిల్ల తీసుకోలేదు. ఆ పిల్లవాణ్ణి నేనెరుగుదును. వాడు నన్ను పలకరించకుండానే వెళ్లిపోయాడు.

నేను కొంతసేపు అక్కడే నిలబడిపోయాను.

ఊరి పెద్దలతో ప్రసంగించాను. చదువుకోడానికి పిల్లలకి తీరుబడిలేదన్నారు. జీవనోపాధి వాళ్లకు భగవంతుడేదో కల్పించే ఉన్నాడు కాబట్టి వేరే ఈ చదువు జీవనోపాధి కోసమే కాదనిన్ని జ్ఞానాభివృద్ధి... యిత్యాదిగా చెప్పాను. చెప్పేటప్పుడు నా అంతరాత్మ నాకు జ్ఞాపకం చేసింది - ఏమనంటే, నేను చదువుకొన్నది జీవనోపాధికే అనీ, లోకమంతా ఇప్పుడు చదువుకుంటూ ఉన్నది జీవనోపాధికే అనీ, ఆ గ్రామములో నేను

చదువు చెప్పదలచుకొన్నది జీవనోపాధికే అనీ.

వాళ్లడిగారు నన్ను, ఏమి చదువు చెప్తుతావని. ఇంగ్లీషు, తెలుగు, లెక్కలు, హిష్టరీ వగైరా పేర్లు చెప్పాను. వాళ్లొకమాట చెప్పేరు. వాళ్ల ఊళ్లో ఒక అమ్మాయి చదువుకోడానికి పట్నవాసం వెళ్లిందట. ఎవరో వచ్చి తీసుకువెళ్లారుట. ఆ పిల్లకు తల్లిదండ్రులు లేకపోవడంవల్ల వెళ్లవీలయిందిట. ఆ పిల్ల చదువుకొందిట. దానికి ఫలంగా ఆ పిల్లకి వచ్చిందేమిటంటే! వేషాలు వేసుకుందామని తీరని ఆశా, వాళ్ల దేవుళ్లని కొలవకపోవడం, తన గ్రామస్థులను చూచి అసహ్యించుకోవడమూ, అన్నిటికన్న గొప్ప విషయం - పెళ్లి చేసుకోకపోవడం. నిజానికి పెళ్లి చేసుకోకపోవడంలో ఆ పిల్లది తప్పేమీ లేదుట. ఎందువల్లనో ఏ సంబంధమూ కుదురలేదుట. కాబట్టి వాళ్ల దేవుళ్లని మరిపించే చదువు వాళ్ల కక్కరలేదన్నారు. వేషాలు పెంచే చదువు వాళ్ల కక్కర్లేదన్నారు. పెళ్ళిని చంపే చదువు వాళ్ల కక్కరలేదన్నారు.

అయితే ఏమంటారన్నాను నేను. ఆ గ్రామస్థులకు చదువు చెప్పే మాటయితే రాత్రివేళ రామాయణమో, భారతమో, భాగవతమో పాఠాలు చెప్పమన్నారు - నన్ను - ఇంగ్లీషు చదువుకొన్న నన్ను! నేను మాట్లాడలేదు. నూటికి ముప్పై మూడున్నర తెలివితేటలు తెలుగులో సంపాదించిన నేను భారత భాగవత రామాయణాదులు పాఠం చెప్పడమా? సెలవు పుచ్చుకొని బయలుదేరాను.

సాయంకాలము గోదావరి గట్టునే వస్తున్నాను. పల్లెలకు పోయే స్త్రీ పురుషులు ఎదురుపడ్డారు. అలవాటు చొప్పున దుబ్బులకేసి చూచాను. దుబ్బులు నన్ను చూచి నవ్వాయి. ఆ పిల్లకోసం గోదావరి తీరం అంతా కళ్లతో పరీక్ష చేశాను. ఆ పిల్ల ఒక చెట్టుకొమ్మమీద కూచుని ఎండు పుల్లలు విరిచి కింద పడేస్తోంది. ఆ పిల్లవాడి కోసం చూచాను. వాడు దూరాన్నున్న పశువుల నదలించి ఇంటిముఖం పట్టిస్తున్నాడు. నేనక్కడ ఆగాను. ఆ పిల్లవాడు చెట్టు మొదటకు వచ్చాడు. ఆ పిల్ల విరిచి పడవేసిన పుల్లలన్నీ ఆ గంపలోకి ఎత్తాడు. ఆ పిల్లచెట్టు దిగుతోంది. ఆ పిల్లకేసి చూస్తున్నాడు. వెనక్కు విరిచికట్టిన చీర, మెడమీదికి దిగజారుచున్న ముడివేసిన పెద్ద జుట్టు, కళ్లకు కడియాలు, పెదవులకు నవ్వులు, కళ్లకు తళుకులు.

పక్షి చెట్టు కొమ్మమీద గెంతడం చూచారా? చెట్టునంటిపెట్టుకొని పాకే తీగను చూచారా? తొడిమి వీడి కిందికి దిగజారే పువ్వును చూచారా? పిల్ల కిందకు దుమికింది చిన్న కొమ్మమీద నుంచి. పిల్లవాడు నవ్వాడు. పిల్లవాడు బుట్ట ఆమె నెత్తిమీద పెట్టాడు.

వాళ్లు పాటలకు మెరుగులు పెడుతూ నడిచి వస్తున్నారు. చెట్ల పూవు లొక్కొక్కటి వాళ్లమీద రాల్తున్నాయి. గట్టుపక్క మోదుగు పువ్వులు రెండు తుంపి పిల్లవాడు ఆ పిల్ల కర్ణాల నలంకరించాడు. పక్షులు కిలకిలలాడుతున్నాయి. సూర్యుని అరుణకిరణాలు లోకాన్నంతనీ కప్పాయి. కాని వాళ్లమీద మరింత దట్టంగా పడ్డాయి. గోదావరి వాయువు ద్వారా వాళ్ల కాశీర్వచనాలు పంపింది. వాళ్లుగట్టెక్కారు. నన్ను చూచారు. "వెడుతున్నా; పిల్లా!" అన్నాను. "మంచిది, అన్నయ్య గారు! మళ్లీ ఎప్పుడొస్తా"రంది. ఆ పిల్ల విగ్రహమంతా నన్ను చూచి నవ్వినట్లయింది.

"వెడుతున్నానురా, అబ్బీ!" అన్నాను. "మచింది, బాలయ్యా!" అన్నాడా పిల్లవాడు.

వాళ్లు నన్నుదాటిపోయారు. గోదావరి కేసి చూచాను. నిజమో కాదో నేను చెప్పలేను గాని గోదావరి కూడా నన్ను చూసి నవ్వినట్లయింది.